# తళుకు

నవతరం యువతుల కోసం ప్రత్యేక శీర్షిక.
వారంవారం చూడండి మరింత కొత్తదనానికి.

## సంతోషంగా వుండగలమా?

మేమిద్దరం చిన్నప్పటి నుంచి స్నేహితులం. మా స్నేహం ప్రేమగా మారింది. అప్పటి నుంచి మా పెద్దవాళ్ళు మమ్మల్ని విడదీయాలని చూస్తున్నారు. స్నేహితులుగా వున్నప్పుడు ఏమీ అనలేదు. ఇప్పుడు మేం పెళ్ళి చేసుకుంటామంటే అడ్డు చెబుతున్నారు. కారణం మా ఇద్దరి కులాలు వేరు. పైగా అతని తల్లిదండ్రులకు కట్నం కావాలిట. పైగా నన్ను తక్కువ కులందానిగా చూస్తున్నారు. మేం బి.సి, రాజేష్ వాళ్ళు ఓ.సి. రాజేష్‌కి నేనంటే చాలా ఇష్టం. అలాగే నాకు అతనంటే చాలా ఇష్టం. బిటెక్ చదివాం. ఒక మంచి కంపెనీలో ఉద్యోగం కూడా చేస్తున్నాను. రాజేష్ కూడా ఉద్యోగం చేస్తున్నాడు. కానీ పెద్ద కంపెనీ కాదు. అతను కూడా మంచి జాబ్‌లో సెటిల్ అయ్యాక, పెద్దవాళ్ళకు ఒకసారి చెబుదామనుకుం టున్నాం. వాళ్ళు అంగీకరించినా, అంగీకరించకపోయినా కూడా మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాం. పెద్దలను ఎదిరించి మేం పెళ్ళి చేసుకుంటే ఏ సమస్యలు లేకుండా మేం సంతోషంగా జీవించగలమా? అనే భయం నన్ను వేధిస్తోంది.

– రోహిత, హైదరాబాద్



### సినిమా పేర్ల పేరడీ

బెండు అప్పారావు ఆర్.ఎమ్.పి
గుండు గుత్తారావు కాంపౌండర్

పంపినవారు:
బి.హరికృష్ణ, పొనగల్లు

నోట్: కొత్త సినిమా పేర్లకే పేరడీలు రాసి పంపండి.

## అమ్మ మనసు కూడా ఇలా ఉంటుందా?

**సమాధానం**

అమ్మా ప్రియంవదా-
నీది చాలా చిన్న సమస్య. నువ్వే పెద్ద హృదయంతో సర్దుకుపోవాలి. పైగా మీ అమ్మగారిలాంటి పాతకాలం వ్యక్తులు మూఢవిశ్వాసాలు, గుడ్డినమ్మకాలను పట్టుకు వేలాడుతుండడం సహజం. నువ్వు నీ నడవడికతో, నడతతో, బాధ్యతాయుతంగా మీ అమ్మగారికి సహాయకారిగా వుంటే ఉంటే ముమ్ముందు నీకు తిరుగుండదు. ఇక మీ చెల్లెలంటావా... ఫోజు కొట్టడం అదీ తన పసితనాన్ని, చిన్నపిల్లల మనస్తత్వాన్ని తెలియజేస్తోంది. పైగా ప్రతీ దాన్నీ సీరియస్‌గా తీసుకుని మనసు పాడు చేసుకుంటే సరిగ్గా చదవలేక, విద్యలో వెనుకపడిపోయే ప్రమాదంవుంది. అందుకనీ అన్నీ టేకిట్ ఈజీగా తీసుకుంటూ చేతలతో, ప్రవర్తనతోనే వారిద్దరిలోనూ మార్పు తీసుకురావటం కష్టమేమీ కాదు. మీరు మరీ అంత సున్నితంగా వుండకండి.

– ఎన్.సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళంటౌన్



# వెలుకు

చలోమోహనరంగాలకు ప్రత్యేక శీర్షిక. దీన్ని మీరే తీర్చిదిద్దుకోవాలి మరి.

### జోక్ — ఎవరిని?

గిరి: స్వాతి, శృతి ఇద్దర్ని ప్రేమించావు కదా? ఎవర్ని పెళ్ళి చేసుకుంటావు?
**హరి:** ఉండరాబాబూ! నాకు పెద్ద సమస్య వచ్చింది.
గిరి: ఏమైంది రా?
**హరి:** ఇప్పుడు మా ఆవిడో పెద్ద సమస్య అయిపోయింది.

– ఆర్.సి.రెడ్డి, చిదామిల్లు

## ఎన్నాళ్ళు ఇలా...?

**సజెషన్ బాక్స్- 52**

నేను బిటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. నేను కొంచెం మొహమాటస్తుడిని. ఇప్పటి తరం పిల్లల్లా అందరితో ఫ్రీగా మాట్లాడలేను. నేను పెరిగిన వాతావరణమే అందుకు కారణం కావచ్చు. మా క్లాసులో ఒకమ్మాయి అంటే నాకు చాలా ఇష్టం. ఆమె అందంగా వుంటుంది. బాగా చదువు తుంది. మొదటి సంవత్సరం కాలేజీలో చేరిన రోజునే ఆమెను చూసాను. ఆరోజే మనసుకు తెలియని భావమేదో నాకు ఏర్ప డింది. గత మూడు సంవత్సరాల నుండి గమనిస్తున్నా ను. మామూలుగా ఎప్పుడైనా మాట్లాడడం తప్ప మా ఇద్దరి మధ్య పెద్దగా స్నేహంలేదు. నా మనసులో మాట ఆమెకుకానీ, ఫ్రెండ్స్‌కి కానీ చెప్పలేదు. ఇప్పుడు చదువు అయిపోతోంది. ఎలా చెప్పాలో తెలియ డంలేదు. వచ్చే వాలెంటైన్స్ డేరోజు అయినా చెప్పాలనుకుంటున్నాను.

– కృష్ణకాంత్, మచిలీపట్నం

**సజెషన్ బాక్స్ 50**

**సమాధానం**

ఫణీంద్రగారూ... ముందు మీపై మీరు కాన్ఫిడెన్స్ పెంచుకోండి. వచ్చే భార్య వల్ల మారిపోయి తల్లిని వదిలేయడంపై మీ మిత్రులకు జరిగిన సంఘటనలను చూసి మీరు భయపడటం సరికాదు. మీ మనసును అర్థం చేసుకొని మీలో ఒకరిగా కలిసిపోయే అమ్మాయిని చూసి వివాహం చేసుకోండి. మీ అన్వేషణలో ఆలస్యమయినా ఫర్వాలేదు. కానీ, మంచి అమ్మాయిని ఎంచుకోండి. మీ అమ్మను మీరు బాగా చూడగలిగితే ఆ అమ్మాయి కూడా బాగానే చూస్తుంది. అంతే తప్ప లేనిపోని అపోహలతో విలువైన జీవితాన్ని వృధా చేసుకోకండి. అమ్మకు ఆసరాగా ఉండే మంచి అమ్మాయిని చేసుకుని హాయిగా జీవించండి. ఆ వచ్చే అమ్మాయిని మీ అమ్మగారు కూడా తన బిడ్డలా చూడాలి మరి. అప్పుడే ఆమె కూడా అత్తను అమ్మలా చూడగలుగుతుంది.

– శ్రీరామ్ సబ్బిశెట్టి,
వేములపాలెం, తూర్పుగోదావరి జిల్లా

## సంపంగి

**కాలమ్ సైజ్ ప్రేమకథ**

రామచంద్ర వాళ్ల నాన్న ఓ ప్రైవేట్ సంస్థలో గుమాస్తా. మధ్య తరగతి కుటుంబం. ఒక కొడుకు, ఒక కూతురు. ఇద్దరూ కాలేజీలో చదువుతున్నారు. రామచంద్రను ముద్దుగా చందూ అని పిలుస్తారు. చందు చక్కనివాడే కాని కాలు కొంచెం అవిటి. సెలవు రోజుల్లో మోటార్ సైకిళ్ల రిపేరు చేసి తండ్రికి సాయపడుతుంటాడు.

వాళ్లు ఉంటున్న వీధిచివర ఓ పూలకొట్టు ఉంది. అక్కడో అమ్మాయి పూలు అమ్ముతూ ఉంటుంది. ఒక్కసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపించేంత అందంగా ఉంటుంది. కాలేజికి వెళ్తూ, వస్తూ ఆ అమ్మాయిని ఆశగా, నవ్వుతూ చూసేవాడు చందు. ఆ అమ్మాయి కూడా చందును నవ్వుతూ చూసేది. మాటలు కలిశాయి. మరి మనసులు...? ఏమో! అంత అందమైన అమ్మాయి తనలాంటి అవిటివాణ్ణి ప్రేమిస్తుందా? నమ్మబుద్ధి కాలేదు. పేరు కూడా సువాసనభరితం... సంపంగి!

ఒకరోజు కొట్టుదగ్గరకొచ్చి ఒక గులాబి పువ్వు ఇవ్వమని అడిగాడు.

"ఎంత?..."

"రూపాయి..."



రూపాయి తీసి ఇవ్వబోయాడు.

"వద్దులెండి" అంది.

"ఊరికే తీసుకుంటే పనికాదు" అని రూపాయి ఇచ్చి ఆ పువ్వు చేతిలో పట్టుకొని ముందుకు చాపాడు. నవ్వి, తీసుకొని జడలో పెట్టుకుంది.

"థాంక్స్" అని హాయిగా నిట్టూర్పు విడిచి నవ్వుతూ వెళ్లాడు.

కొన్ని రోజులు గడిచాయి. చూపుల రాయబారాలు, మాటల మంతనాలు మామూలైపోయాయి. "మీరు అదృష్టవంతులు, చదువుంది, ఉద్యోగమొస్తుంది... అప్పుడు మా లాంటివాళ్లు మీకు గుర్తుండరు" అని కన్నీరు పెట్టింది సంపంగి.

"ఈ అవిటివాణ్ణి ఎవరు చేసుకుంటారు?" అన్నాడు చందు.

"అమ్మాయి అవిటిదైతే మీరు చేసుకుంటారా?" సంపంగి అడిగింది.

"నన్ను ప్రేమిస్తే చాలు- తప్పకుండా చేసుకుంటాను"

"నేనూ... అవిటిదాన్నే" అంటూ నిలబడబోయి, పడబోతుంటే చందు సంపంగిని పట్టుకొని, మనిద్దరం ఒకరికి ఒకరం అని గట్టిగా హత్తుకున్నాడు.

"ఈ రోజేంటో తెలుసా?"... "ఆదివారం" "కాదు ప్రేమికుల రోజు" అని ఇంకా గట్టిగా హత్తుకున్నాడు.

– బేతంచర్ల శ్యామ్‌సుందర్, వినుకొండ